హైదరాబాద్‌ను రెండవ రాజధానిగా చేయాలి

హైదరాబాద్‌ను రాజధానిగా చేయాలని డిమాండ్ చేస్తున్న పలువురు వక్తలు

చిక్కడపల్లి, మే 3 : హైదరాబాద్ నగరాన్ని దేశ రెండో రాజధానిగా చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. దక్షిణాది జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో హైదరాబాద్ నగరాన్ని దేశ రెండవ రాజధానిగా ఏర్పాటు చేయాలని సమావేశం నిర్వహించారు. కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ మాట్లాడుతూ.. 1955లో భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ హైదరాబాద్‌ను దేశానికి రెండవ రాజధానిగా చేయాలని మొదటి రాష్ట్రాల పునర్విభజన కమిషన్‌కు లేఖ రాస్తూ ఉత్తరాదికి ఢిల్లీ, దక్షిణాదికి హైదరాబాద్‌ను దేశ రాజధానులుగా చేయాలని ప్రతిపాదించారని తెలిపారు. దేశ స్వాతంత్ర్యం అనంతరం పరిపాలన విభజన ఫలాలను ఉత్తరాదివారే ఎక్కువగా అనుభవించారని చెప్పారు. అందుకే పరిపాలన విభజన కోసం ప్రజల సమగ్రంగా అభివృద్ధి చెందడానికి హైదరాబాద్‌ను దేశానికి రెండో రాజధానిగా చేయాలని ప్రతిపాదన పెట్టారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మేధావుల ఫోరం అధ్యక్షుడు జలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ.. దక్షిణాది రాష్ట్రాల పట్ల తీవ్ర వివక్షత కొనసాగుతూ వస్తుందని విమర్శించారు. భారతదేశానికి రెండవ రాజధానిగా హైదరాబాద్ నగరాన్ని చేయాలని ఆయన కోరారు. సమావేశంలో నల్ల సూర్య ప్రకాశ్, జిలకర శ్రీనివాస్, ప్రొఫెసర్ తిరుపతి, బీఎల్ఎఫ్ అధ్యక్షుడు దండి వెంకట్, డాక్టర్ సుందర్ కుమార్ దాసు, అశోక్, శంకర్ తదితరులు పాల్గొన్నారు

వార్డు కార్యాలయం పనుల పరిశీలన

ఇందిరానగర్ కాలనీలో అధికారులతో కలిసి పర్యటిస్తున్న కార్పొరేటర్ హేమ

సికింద్రాబాద్, మే 3: ఇందిరానగర్ కాలనీ, నామాలగుండు వార్డు కార్యాలయం పనులను కార్పొరేటర్ హేమ పరిశీలించారు. ఇందిరా నగర్ కాలనీలో స్ట్రాం వాటర్ డ్రైన్ లైన్లలో పూడికతీత పనులను ఆమె జీహెచ్ ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. అకాల వర్షానికి స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ఈ పనులు చేపట్టామని తెలిపారు. అనంతరం నాలాను పరిశీలించారు. నామాలగుండు లోని నిర్మాణంలో ఉన్న వార్డు కార్యాలయాన్ని పరిశీలించారు త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వార్డు కార్యాలయం నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నాయని త్వరగా పనులు పూర్తి చేసి వార్డు కార్యాలయాన్ని అందుబాటులోకి తెస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జీ హెచ్ ఎంసీ ఏ ఈ కౌశిక్, వర్క్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సత్కారం



విద్యార్థులను సత్కరించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, మే 3: క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆయన సత్కరించారు సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థికి లక్ష్యసాధన అంటూ ఉండాలని, పట్టుదలతో చదివినప్పుడే లక్ష్యాన్ని చేరుకోగలమని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ప్రకాశ్, బీఆర్ఎస్ నేతలు బల్లా శ్రీనివాస్‌రెడ్డి, మాధవ్, ముచ్చ కుర్తి ప్రభాకర్, ఆకారం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మృదుమధురంగా మువ్వల సవ్వడి

వేదికపై నృత్య కళాకారులు

అమీర్‌పేట్, మే 3 : కూచిపూడి, కథక్.. భరతనాట్యం.. ఆంధ్రనాట్యం.. ఇలా దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రసిద్ధ నృత్య రూపాలన్నింటిని దాదాపు 150 మంది కళాకారులు తమదైన ప్రదర్శనలతో రక్తి కట్టించారు. దేశ నలుమూలలకు చెందిన 20 నృత్య అకాడమీలకు చెందిన నృత్య కళాకారులు అద్భుతంగా ప్రదర్శించారు. ఈ ప్రదర్శనకు బేగంపేట గ్రీన్‌ల్యాండ్స్‌లోని సెస్ ఆడిటోరియం వేదికైంది. శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ మువ్వలసవ్వడి ప్రతిధ్వనించింది. సాంస్కృతిక కళారూపాలకు, భారతీయ సంప్రదాయ నృత్యానికి పెద్దపీట వేసే మహోన్నత లక్ష్యంతో ఏర్పాటుచేసిన అమృత కల్చరల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రిటైర్డ్ ఐఏఎస్ అధికారి వినోద్ అగర్వాల్, కేంద్ర సంగీత, నాటక అకాడమీ అవార్డు గ్రహీత, ఆంధ్రనాట్య గురువు కళాకృష్ణ గౌరవ అతిథులుగా హాజరయ్యారు. ప్రతిభ చాటిన వారిని గుర్తించి న్యాయ నిర్నేతలు బహుమతులు అందజేశారు. ముద్ర, అభియనం, బృంద స్ఫూర్తి, ప్రేక్షకుల నుంచి స్పందన, వస్త్రాలంకరణ, డిజిటల్ స్పాట్‌లైట్ లాంటి విభాగాలలో పలువురికి అవార్డులు అందించారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని గాంధీనగర్ కార్పొరేటర్ పావని అన్నారు. అశోక్‌నగర్‌లో కొనసాగుతున్న జీహెచ్ఎంసీ సుందరీకరణ పనులను శనివారం కార్పొరేటర్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పనులు వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తీసుకురావాలని అన్నారు.. ఎ.వినయ్ కుమార్, నేతలు శ్రీకాంత్, సురేశ్, రాజు, నీరజ్ పాల్గొన్నారు. – చిక్కడపల్లి, మే 3

కల్యాణోత్సవానికి ఎమ్మెల్యే తలసాని

ఎస్ఆర్‌నగర్‌లోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామిని సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ దర్శించుకున్నారు. ఆలయ 30 వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం ఆలయంలో నిర్వహించిన పూజలలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ పండితులు వేద మంత్రాలతో ఆశీర్వచనం చేశారు. ఆలయ చైర్మన్ బొడ్డు కుమార్, ఈఓ నరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు హన్మంతరావు, నాయకులు అశోక్‌యాదవ్, ప్రవీణ్ రెడ్డి, కూతురు నర్సింహ, గుడిగె శ్రీనివాస్‌యాదవ్, హరి సింగ్ తదితరులు పాల్గొన్నారు. – అమీర్‌పేట్, మే 3

అందాల పోటీలతో ఒరిగేదేమీ లేదు

జిల్లపల్లి అంజి

ముషీరాబాద్, మే 3: రాష్ట్ర ప్రభుత్వం రూ. 200 కోట్లు ఖర్చుపెట్టి అందాల పోటీలు నిర్వహించడం వల్ల రాష్ట్రానికి ఒరిగేదేమీ లేదని బీసీ యువ జన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జిల్ల పల్లి అంజి అన్నారు. రాష్ట్రానికి కావలసింది అందా ల పోటీలు కాదు, నాణ్యమైన విద్య అని ఓ ప్రకటనలో తెలిపారు ప్రభుత్వం నిర్వహించే అందాల పోటీలకు రూ. 200 కోట్లు ఖర్చుపెట్టి నిర్వహించడం వల్ల రాష్ట్రానికి వచ్చే ఆదాయం ఏముండదని, ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

కృత్రిమ మేధపై అవగాహన

హిమాయత్‌నగర్ : నిత్యం సమాజ శ్రేయస్సు కోసం పాటుపడుతున్న సైకాలజిస్ట్ అసోసియేషన్ ఆవిర్భావ దినోత్సవాలను ఈ నెల 5నుంచి నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మోతుకూరి రాంచందర్ తెలిపారు. శనివారం హిమాయత్‌నగర్‌లో అసోసియేషన్ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది.

తుకారాం గేట్ సీఐగా శ్రీకాంత్‌రెడ్డి

అడ్డగుట్ట, మే 3 : తుకారం గేట్ పోలీస్ స్టేషన్ నూతన సీఐగా శ్రీకాంత్ రెడ్డి బాధ్యతలను స్వీకరించారు. 20 04 బ్యాచ్ కి చెందిన శ్రీకాంత్‌రెడ్డి బహదూర్‌పురా సీఐగా పనిచేసి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన శంకర్ చిక్కడపల్లి డీఐగా బదిలీపై వెళ్లారు. సీఐ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ... శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని అన్నారు.

గాంధీనగర్ సీఐగా బోస్‌కిరణ్

కవాడిగూడ, మే 3: గాంధీనగర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా బోస్ కిరణ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన సీఐ డి. రాజు అసిఫ్‌నగర్ డీఐగా బదిలీపై వెళ్లారు. ఇప్పటివరకు పంజాగుట్ట ట్రాఫిక్ సీఐగా విధులు నిర్వహించిన బోస్‌కిరణ్ గాంధీనగర్ పీఎస్‌కు సీఐగా బదిలీపై వచ్చారు. ఈ మేరకు శనివారం బాధ్యతులు చేపట్టి ఆయన మాట్లాడుతూ గాంధీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్టమైన చర్యలు చేపడతామని అన్నారు.

తోట శ్రీనివాస్‌కు ఓయూ డాక్టరేట్

ఉస్మానియా యూనివర్సిటీ : ఉస్మానియా యూనివర్సిటీ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగంలో తోట శ్రీనివాస్ డాక్టరేట్ సాధించారు. ప్రొఫెసర్ సతీశ్‌కుమార్, ప్రొఫెసర్ కృష్ణవేణి పర్యవేక్షణలో 'డిజైన్ అండ్ డెవలప్మెం ట్ ఆఫ్ కోఆర్డినేటెడ్ కంట్రోల్ ఆఫ్ మల్టీ లెవెల్ ఇన్వర్టర్స్ ఇన్ ఏ డిస్ట్రిబ్యూటెడ్ ఎనర్జీ సిస్టం' అనే అంశంపై పరిశోధన పూర్తిచేసి శ్రీనివాస్ సమర్పించిన పరిశోధన గ్రంథాన్ని పరిశీలించిన ఓయూ ఎగ్జామినేషన్ బ్రాంచ్ అధికారులు ఆయనకు పీహెచ్డీ పట్టాను ప్రధాన చేస్తున్నట్లు ఒక ప్రకటన విడుదల చేశారు. శ్రీనివాస్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రామకృష్ణాపూర్ పట్టణంలో ఆర్కే 5 సింగరేణి గనిలో కార్మికుడిగా పని చేసిన తోట సదానందం విజయలక్ష్మి దంపతుల కుమారుడు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు అభినందించారు.

చేనేత హస్తకళా వస్తువులను ప్రతి ఒక్కరూ ఆదరించాలి

చేనేత కాటన్ సిల్క్ ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి

కవాడిగూడ, మే 3 : ప్రతి ఒక్కరూ చేనేత హస్తకళా వస్తువులను ఆదరించి చేతివృత్తి కళాకారులను ప్రోత్సహించాలని తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి అన్నారు. నగరంలోని తెలంగాణ కళాభారతి (ఎన్టీఆర్ స్టేడియం)లో ఏర్పాటు చేసిన శ్రీ సాయి చేనేత కాటన్ సిల్క్ ఎక్స్‌పోను శనివారం రమేశ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన పలు స్టాల్స్‌ను సందర్శించి కళాకారులతో ముచ్చటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మన సంప్రదాయానికి ప్రతీక చేనేత వస్త్రాలు అని చెప్పారు. అన్ని రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారులు ఎక్స్‌పోలో 120 స్టాల్స్ ఏర్పాటు చేయడం, ఈఎక్స్‌పోను మహిళలు నిర్వహించడం గొప్పవిషయమన్నారు. ప్రతి ఒక్కరూ ఎక్స్‌పోను సందర్శించి చేనేత, హస్తకళా వస్తువులను కొనుగోలు చేసి కళాకారులకు చేయూతనివ్వాలని సూచించారు. నిర్వహకురాలు పద్మజ మాట్లాడుతూ.. చేనేత కాటన్ సిల్క్ఎక్స్‌పో ప్రతి రోజూ ఉదయం పదిగంటల నుంచి రాత్రి 9 గంటల వరకు జూన్ 2వరకు కొనసాగుతుందన్నారు. ఈ అవకాశాన్ని నగర వాసులందరూ సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైటప్.ఎన్టీఆర్ స్టేడియంలో చేనేత కాటన్ సిల్క్ ఎక్స్‌పోను ప్రారంభించిన పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

అభివాదం చేస్తున్న రాజిరెడ్డి తదితరులు

చిక్కడపల్లి, మే 3: ఆర్టీసీ కార్మికులపై రోజురోజుకూ పెరుగుతున్న పనిభారంతో పాటు, కార్మికుల క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీజీఎస్ ఆర్టీసీ స్టాఫ్, వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.రాజిరెడ్డి అన్నారు. టీజీఎస్ఆర్టీసీ స్టాఫ్, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలోఆర్టీసీ కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి శనివారం సాయంత్రం బస్ భవన్ వద్దా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంజీవరెడ్డి మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికుల పెండింగ్ సమస్యలపైన, క్షేత్ర స్థాయిలో కార్మికులు పడుతున్న ఇబ్బందులను వెంటనే పరిష్కరించాలని అన్నారు. అధికారులు, సూపర్ వైజర్స్ కార్మికులపై వేధింపులు ఆపాలని, పనిభారాలను తగ్గించాలి కోరారు. వేతన సవరణ అమలుకు,ఆర్టీసీలో యూనీయన్లను అనుమతించాలని కోరాలు. ఆర్టీసీ కార్మికూలను ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. రిటైర్ అయిన ఉద్యోగుల సమస్యల పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో ఐఎన్టిసియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, జూనియర్ నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

బొల్లారం, మే 3 : ఎనిమిదో వార్డు బొల్లారం డౌటన్ బజార్ లోని గంగపుత్ర సంఘం కమ్యూనిటీ హాల్‌లో జనహిత సేవా ట్రస్ట్, కిమ్స్ ఫౌండేషన్‌ల సహకారంతో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో కిమ్స్ హాస్పిటల్ నుంచి జనరల్ ఫిజీషియన్, గైనకాలజిస్ట్, పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్ డాక్టర్‌లు 150 మందిని పరీక్షించి మందులు అందజేశారు. సాయి జ్యోతి ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించారు. భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో ప్రతి ఒక్కరికీ రక్తం పరీక్షించి, రక్తహీనత ఉన్నవారికి ఐరన్ టాబ్లెట్లను అందజేశారు. ఎమ్మెల్యే శ్రీగణేశ్, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జయప్రకాశ్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, జనహిత సేవా ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నరసింహమూర్తి, శోభారాణి, నర్సింగ్‌రావు, భారత్ వికాస్ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివరామకృష్ణ, గంగపుత్ర సంఘం బొల్లారం అధ్యక్షుడు యోగేశ్వర్ పాల్గొన్నారు.

ఓయూ ఉద్యోగుల హౌసింగ్ సొసైటీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ : ఉస్మానియా యూనివర్సిటీ నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ఎన్నికల అధికారి లక్ష్మీనారాయణ విడుదల చేశారు. సీక్రెట్ బ్యాలెట్ విధానం ద్వారా నిర్వహించనున్న ఈ ఎన్నికల్లో మొత్తం తొమ్మిది మందిని ఎన్నుకోనున్నట్లు ఆయన తెలిపారు. ఈ నెల 5న ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు వర్సిటీలోని ఎలక్ట్రికల్ సెక్షన్ కార్యాలయంలో నామినేషన్లను స్వీకరించనున్నట్లు చెప్పారు. 6న నామినేషన్లను పరిశీలించి, చెల్లుబాటయ్యే నామినేషన్లను ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. నామినేషన్ల ఉపసంహరణను 7న అవకాశం కల్పించామని, అర్హులైన నామినేషన్ల జాబితాను అదేరోజు సాయంత్రం నాలుగు గంటలకు విడుదల చేస్తామని స్పష్టం చేశారు. వచ్చే నెల 10న నాన్ టీచింగ్ హోంలో ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఎన్నికలు ముగిసిన అనంతరం ఓట్లను లెక్కించి, ఫలితాలను విడుదల చేస్తామని పేర్కొన్నారు.

రేపటి నుంచి రైతులకు అవగాహన సదస్సులు

మండల వ్యవసాయ అధికారి శ్వేత

శంషాబాద్ రూరల్, మే 3 : మండలంలోని వివిధ గ్రామాల రైతులకు వానకాలంలో సాగుచేసే పంటలపై ఈ నెల 5 నుంచి ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి శ్వేత శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలోని వివిధ గ్రామాలలోని రైతులకు వ్యవసాయ, అనుబంధ పంటలసాగుపై వివిధ అంశాలపై వ్యవసాయశాఖ, జయశంకర్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో నిర్వహించే అవగాహన కార్యక్రమాలకు ఆయా గ్రామాల రైతులు పాల్గొని వారు సాగు చేస్తున్న పంటలపై మరింత అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ నెల 5న కొత్వాల్‌గూడ,6న హమిదుల్లానగర్, 12న పోశెట్టిగూడ, 13న కవేలిగూడ, 19న నర్కూడ, 20న రషీద్‌గూడ, 26న రామంజాపూర్, 27న చిన్నగోల్కొండ, జూన్3న సంఘీగూడ, 4న కాచారం, 9న రాయన్నగూడ, 10న శంకరాపూర్ గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

ఎస్ఎస్‌సీ ఫలితాల్లో సీఎమ్మార్ విద్యార్థుల విజయధంకా

అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న గోపాల్‌రెడ్డి

బొల్లారం, మే 1 : పదో తరగతి ఫలితాలలో బోయినపల్లి సీఎమ్మార్ హై స్కూల్ విద్యార్థులు 99 % ఫలితాలు సాధించి, మండలలో వివిధ ర్యాంకులను సొంతం చేసుకున్నారు. వీరిలో ఐశ్వర్య 572 , మెట్టు ఆశ్రిత కుమా ర్ 572 , చరిత్ 571, సాయి అచ్చుత 570 , మహమ్మద్ ఆరిపుకుద్దీన్ 568, నాగ సాయి హిమేష్ 568, ప్రణయ్ కుమార్ 563,జంపాల దినకరన్ 562, సైదా జునేరా ఫాతిమా 561,సుమయ్యా సుల్తానా 554, సైద్ హది 548, మంగిలిపెల్లి కావ్య 546, సాల్వేర్ లాస్య ప్రియ 544, కార్ప్ సూరజ్ 541, మనీష్ 541, నసీమ తస్లీమా 540, సూర్య శ్రీకర్ మద్దాలి తిరుమల 540 అత్యుత్తమ మార్కులు సాధించారు. మొత్తం 137 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 99 % ఉత్తీర్ణతతో పాటు, 96 % విద్యార్థులు 90 % కంటే ఎక్కువ మార్కులు సాధించి, సీఎమ్మార్ హై స్కూల్ ఖ్యాతిని మండల స్థాయిలో నిరూపించారు. ఈ సందర్భంగా గోపాల్ రెడ్డి మాట్లాడుతూ అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయ బృందం, ప్రత్యేక తరగతు ల నిర్వహణ, సమయానికి అనుకూలంగా విద్యార్థులకు తగిన విధంగా మోటివేషన్ కల్పించడం ద్వారా, మంచి ఫలితాలు సాధించినట్లు తెలిపారు. 90 % కు పైగా మార్కు సాధించిన విద్యార్థులకు, వారి తల్లి దండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

సంగీతానికి దిశా నిర్దేశం చేసిన త్యాగరాజస్వామి

ముషీరాబాద్, మే 3: కర్ణాటక శాస్త్రీయ సంగీతానికి దిశా నిర్దేశనం చేసిన వాగ్గేయకారులు త్యాగరాజ స్వామి అని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. త్యాగరాయ గానసభలో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా త్యాగరాజ స్వామి జయంతి వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. అన్నమయ్య కీర్తనలు సాహిత్య ప్రధానం కాగా త్యాగరాజ కీర్తనలు సంగీతం పాళ్లు అని వివరించారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్దన మూర్తి అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో వంశీ, గాన సభ కార్యవర్గ సభ్యులు బండి శ్రీనివాస్, ద్రవిడ్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి అన్నమాచార్య సంకీర్తన ఉత్సవాలు

ముషీరాబాద్, మే 3: తొలి తెలుగు వాగ్గేయకారుడు, పదకవితా పితామహుడు శ్రీ తాళ్లపాక అన్నమాచార్య 617 జయంతి సందర్భంగా ఎస్ఏఎస్ఎస్ వి చారిటబుల్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో తాళ్లపాక అన్నమాచార్య సంకీర్తన మహా యజ్ఞం నిర్వహించనున్నట్లు చారిటబుల్ ఫౌండేషన్ చైర్మన్ అనూరాధ దేవి ఒక ప్రకటనలో తెలిపారు. గురు శ్రీ వేంకటేశ్వర్లు కోటపాటి గోవిందదాస స్వరపరచిన 108 అన్నమయ్య సంకీర్తన లతో మే 5 వతేదీ నుంచి మే 11 వరకు త్యాగరాయ గానసభలోని అన్నమయ్య సంకీర్తన మహాయజ్ఞం నిర్వహించినట్లు తెలిపారు. 5 వ తేది కడపరాయ సంకీర్తనలు, 6 వతేది అమ్మవారి సంకీర్తనలు, 7న కల్యాణ సంకీర్తనలు, 8న నృసింహ సంకీర్తనలు, 9న శ్రీ రామ శ్రీ కృష్ణ సంకీర్తనలు, 10న విష్ణు సంకీర్తనలు 11న వైరాగ్య సంకీర్తలు అనే 7 విభాగలుగా వారు స్వరపరిచిన 108 సంకీర్తన లను గానం చేస్తారని పేర్కొన్నారు.

టీజీఎస్ఆర్టీసీ లాజిస్టిక్ సేవలు ప్రారంభం

మణికొండ, మే 3: మణికొండ మర్రిచెట్టు బస్‌స్టాప్ వద్ద టీజీఎస్ఆర్‌టీసీ లాజిస్టిక్ సేవలు ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ మాజీ చైర్మన్ నరేందర్, వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డిలు పాల్గొన్నారు. మణికొండ పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మీ పార్సళ్లను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఇతర రాష్ట్రాలకు బుకింగ్ చేసుకొని పంపించుకోవాలన్నారు. ప్రజల సౌకర్యం కోసం ఆర్టీసీ ఈ సేవలను ప్రారంభించిందన్నారు. ఈ కార్యక్రమలో ఆర్టీసీ అధికారులు ఏటీ ఎం పాల్, డీఎంఈ రమేశ్, ఏజెంట్ రమేష్‌గౌడ్, నరేందర్‌రెడ్డి, రవికాంత్‌రెడ్డి, రాఘవరెడ్డి, ఆనంద్ రావు, రాజేష్, ముత్యాలు, శ్రీనివాస్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, రాములు పాల్గొన్నారు.